సాక్షి మంచిర్యాల

మంగళవారం । 7 । మార్చి । 2023

ఘనంగా కాముడి దహనం

చెన్నూర్: పట్టణంలోని గాంధీచౌక్, జగన్నాథాలయం, బడా హనుమాన్ మందిర్, గ్రంథాలయ వీధుల్లో బ్రాహ్మణులు, మార్వాడీలు సోమవారం రాత్రి కాముడి దహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మారుపాక శంకరయ్య, శంకర్ శాస్త్రి, దామెర అనిల్‌చార్యులు, మార్వాడీ కులస్తులు పాల్గొన్నారు.



చెన్నూర్ గ్రంథాలయ వీధిలో కాముడి దహన పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

టీఎస్‌పీఎస్సీ ర్యాంకర్‌కు డీసీపీ అభినందన



సంకీర్తనను సన్మానిస్తున్న డీసీపీ సుధీర్ ఆర్ కేకన్

మంచిర్యాలఅర్బన్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష ఈవో(ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్) ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 29వ ర్యాంకు సాధించిన బొడ్డు సంకీర్తనను మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమై ర్యాంకు సాధించినందుకు సోమవారం డీసీపీ కార్యాలయంలో సత్కరించారు. గ్రంథాలయంలో ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకుని ఎస్సై ఉద్యోగాల్లో అర్హత సాధించిన మహిళా అభ్యర్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ పాల్గొన్నారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈవో వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యూఆర్ఎస్)లో జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు సైన్స్ ప్రదర్శనలు నిర్వహించారు. ఫిబ్రవరి 28న ఎస్సీఈఆర్టీ నిర్వహించిన సైన్స్ సెమినార్‌లో అర్బన్ రెసిడెన్షియల్‌కు చెందిన సైన్స్ టీచర్ త్రిలోచన పల్లవిని డీఈవో సన్మానించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన, బుర్రకథ అంశాలపై ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డీఎస్‌వో మధుబాబు, సెక్టోరల్ అధికారులు పద్మజా, శ్రీనివాస్, పాఠశాల ప్రత్యేకాధికారి సంతోష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా మహిళల క్రీడా పోటీలు



టగ్ ఆఫ్ వార్ పోటీలో మహిళలు

శ్రీరాంపూర్: ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహించారు. జీఎం సతీమణి, ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి పోటీలను ప్రారంభించారు. ఉద్యోగినులతో కలిసి ఆమె టగ్ ఆఫ్ వార్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బాల్‌త్రో, బాల్ ఇన్ బాస్కెట్ ఇంకా ఇతర క్రీడల్లో పోటీలు జరిగాయి. విజేతలకు ఈ నెల 8న ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో బహుమతి ప్రదానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం బీ.సంజీవరెడ్డి, ఏరియా ఎస్‌ఓటు జీఎం త్యాగరాజు, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఓసీపీ పీఓ పురుషోత్తంరెడ్డి, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, సీనియర్ పీఓ కాంతారావు, జీఎం కార్యాలయం పిట్ సెక్రెటరీ పీవీ రావు పాల్గొన్నారు.

అక్రమ పట్టాదారులపై చర్యలు తీసుకోవాలి



సింగరాయిపేట గ్రామస్తులు

మంచిర్యాల అగ్రికల్చరల్: జన్నారం మండలం సింగరాయిపేట గ్రామ శివారులోని సర్వేనంబర్ 147/6, 147/11లలో గల 7.22 ఎకరాల భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై చర్య తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆదివాసీ గిరిజనులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. సింగరాయిపేట గ్రామ శివారులోని చెరువు ప్రాంతంలోని సీలింగ్ భూమిని తపాలపూర్ గ్రామానికి చెందిన సీపతి రమణ, సైనాల విజయ్‌కుమార్ పేర్లతో అక్రమంగా పట్టా చేసుకున్నారని తెలిపారు. రైతుబంధు పొందుతున్నారని, బ్యాంకులో రుణం పొందారని పేర్కొన్నారు. అక్రమ పట్టాదారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వాధీనంలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భీమయ్య, గ్రామ పెద్ద జెల్ల భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

జ్వరమొచ్చింది..!



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జ్వరంతో చికిత్స పొందుతున్న బాధితులు

- జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిట

మంచిర్యాలటౌన్: జిల్లా వ్యాప్తంగా జ్వరాలు మళ్లీ విజృంభిస్తున్నాయి. దగ్గు, జలుబుతో మొదలై గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, జ్వరంగా మారి ఆసుపత్రులకు వెళ్లేలా చేస్తున్నాయి. మందులు వాడినా రోజుల తరబడి జ్వరం తగ్గకపోవడం, చిన్నారుల నుంచి వృద్ధుల వరకు జ్వరాల బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులన్నీ వైరల్ జ్వరాల బారిన పడ్డవారితో కిటకిటలాడుతున్నాయి. జ్వరాలు వచ్చిన వారు బయట తిరుగుతుండడం, ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుండడం, కుటుంబ సభ్యుల్లోనూ ఒకరి నుంచి మరొకరికి సోకుతుండడంతో పెద్ద ఎత్తున జ్వర బాధితులు పెరుగుతున్నారు. చలికాలం ముగుస్తుండడం, వేసవి కాలం ప్రారంభం కావడంతో వాతావరణంలో కలిగే మార్పులు కూడా జ్వరాల బారిన పడేందుకు కారణంగా మారుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సమస్య ఉండడంతో, ప్రజలు ఈ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అప్పుడే వైరల్ జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రి ఓపీలో వైద్యుల పరీక్ష



మందులు తీసుకుంటున్న బాధితులు

చిన్నా పెద్ద అందరూ బాధితులే..

జిల్లాలో ఈ ఏడాది జనవరి నెల నుంచి జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతూ పోతోంది. జనవరిలో 2,554 మంది, ఫిబ్రవరిలో 1,973 మంది, మార్చి 5నాటికి 444 మందికి జ్వరం వచ్చినట్లుగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ లెక్కలు చెబుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనే జ్వరంతో బాధపడుతున్న వారు ఈ నెల 3న 160 మంది, 4న 150 మంది, 6న 174 మంది ఓపీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇప్పటికే ఆసుపత్రిలో జ్వరంతో 80 మంది చేరి చికిత్స పొందుతున్నారు. ఇది ఒక్క ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనే. అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లతోపాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో జ్వరం బారిన పడ్డవారు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. చిన్నారుల్లోనూ జ్వర బాధితులు పెరుగుతున్నారు. పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులు, హాస్టల్‌లో ఉండేవారు ఎక్కువగా జ్వరం బారిన పడుతున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ప్రతీరోజు 10 మందికి పైగా విద్యార్థులు వైద్యం కోసం వస్తున్నారు. ఇన్‌ఫ్లుయెంజా(హెచ్3, హెచ్2) లక్షణాలతో కూడినవి రాష్ట్రవ్యాప్తంగా వైరల్ జ్వరాలు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జ్వరం వచ్చి వారం రోజుల వరకు తగ్గకుండా ఉండడం, ఒళ్లునొప్పులు, గొంతునొప్పి, దగ్గు, జలుబుతో ఇబ్బంది పడుతూ ఏ పని చేసుకోలేక పోతున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సరైన పారిశుధ్య పనులు సైతం చేపట్టకపోవడం కూడా జ్వరాలకు కారణంగా మారుతుందని, ముఖ్యంగా చిన్నారులు అనారోగ్యంతోపాటు జ్వరాల బారిన పడుతున్నట్లు పిల్లల వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో జ్వరం బారిన పడే వారి సంఖ్య చిన్నా పెద్దా అనే తేడా లేకుండా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు స్వంత వైద్యం చేసుకోకుండా వైద్యుల పర్యవేక్షణలోనే తగిన మందులను వాడాలని సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రస్తుతం వాతావరణంలో కలిగే మార్పులతోపాటు, ఇతరత్రా కారణాలతో వైరల్ జ్వరాలు పెరుగుతున్నాయి. కరోనా సమయంలో తీసుకున్న జాగ్రత్తలనే ప్రస్తుతం తీసుకోవాలి. మాస్కులు ధరించడం, ఎక్కువ మంది ఉన్న చోట జాగ్రత్తగా ఉండడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, బయటి పదార్థాలను తినకుండా ఉండడం వంటి జాగ్రత్తలు తప్పనిసరి. స్వంతంగా మందులను కొని వేసుకోకుండా దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేసుకుని మందులు వాడాలి. విద్యార్థులకు ఇప్పుడు కీలకమైన పరీక్షల సమయం కావడంతో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటే జ్వరాల బారిన పడకుండా ఉండి చదువుపై ధ్యాస పెడతారు.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి

8న ఆరోగ్య మహిళా క్లినిక్‌ల ప్రారంభం

మంచిర్యాలటౌన్: ఈ నెల 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని నాలుగు పీహెచ్‌సీల్లో ఆరోగ్య మహిళా క్లినిక్‌లు ప్రారంభించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జన్నారం, కుందారం, తాళ్లగురిజాల, మంచిర్యాలలోని బస్తీ దవాఖానా లో ఆరోగ్య మహిళా క్లినిక్‌లు ప్రారంభిస్తామని, ప్రతీ మంగళవారం మహిళలకు మాత్రమే పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేస్తామని తెలిపారు. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలు, ఓరల్, సర్వైకల్, రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్, థైరాయిడ్ పరీక్ష, మూత్రకోశ సంబంధిత ఇన్‌ఫెక్షన్లు, మెనోపాజ్ దశకు సంబంధించిన పరీక్షలు, నెలసరి సమస్యలు, సంతాన సమస్యలు, బరువు నియంత్రణ, యోగాపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మహిళలే వైద్య సేవలు అందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వాలు చేయూత

మంచిర్యాలక్రైం: మహిళల అభివృద్ధికి ప్రభుత్వాలు చేయూతనందిస్తున్నాయని జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్ అన్నారు. స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ సెక్స్ వర్కర్స్ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సీపీఐ కార్యాలయంలో సెక్స్‌వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక వెనుకబాటుతనం వల్లే మహిళలు ఆ వృత్తి లోకి చేరుతున్నారని తెలిపారు. మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయంకృషి, స్వయంశక్తితో ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ పీ.రాజేందర్, మంచి ర్యాల జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, జిల్లా వయోజన విద్య రిసోర్స్‌పర్సన్ వెంకటేశ్వర్లు, జీఎస్ఎమ్ సుజాత, వేణు, లత, కళ్యాణ్, అర్చన, అంజలి, రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ చాంబర్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తన తాత పేరిట గల ఇంటిని మరో వ్యక్తి మున్సిపాల్టీ రికార్డుల్లో తన పేరిట మార్చుకున్నాడని నస్పూర్ మండలం తీగల్ పహాడ్ గ్రామంలోని రాంనగర్‌కు చెందిన గుర్రాల వంశీకృష్ణ ఫిర్యాదు చేశాడు. భీమారం మండలం కొత్తగూడెం కాలనీకి చెందిన తాను గొర్రెల అభివృద్ధి పథకం కోసం దరఖాస్తు చేసుకోగా గతంలో తీసుకున్నట్లు చూపిస్తోందని, విచారణ జరిపి న్యాయం చేయాలని మెండే సతీష్ కోరాడు. భూ సమస్యలు, అక్రమ నిర్మాణాలు, భూ ఆక్రమణలపై, పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ గౌతమి, అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

సమస్యలపై అర్జీల వెల్లువ

భూ సమస్యలు, పింఛన్, వేతనాలు, విద్యుత్ తదితర సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు వెల్లువెత్తాయి. సోమవారం కలెక్టర్ చాంబర్ వద్ద అర్జీదారులు బారులు తీరారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు వివిధ గ్రామాల ప్రజలు పలు సమస్యలు కలెక్టర్‌కు విన్నవించారు.

మెట్లు ఎక్కలేక..

కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల విభాగం పై అంతస్తులోని కలెక్టర్ చాంబర్‌లో నిర్వహిస్తుండడంతో దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. చెన్నూర్ మండలం సోమనపల్లి గ్రామానికి చెందిన రాపాక పెంటయ్య కాళ్లు చచ్చుబడి, ఆయన భార్య రాజమ్మ ఒక కాలు లేక పింఛన్ కోసం వచ్చారు. మెట్లు ఎక్కలేక ఇబ్బంది పడడంతో వారి బంధువు కలెక్టర్‌ను కలిసి అర్జీ సమర్పించారు. ఆటో చార్జీ రూ.800 చెల్లించి ఇంత దూరం వచ్చినా కలెక్టర్‌ను కలిసి సమస్య చెప్పుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

- బెల్లంపల్లి మండలం మత్తమారిగూడెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు బైరి సంతోష్ బెల్లంపల్లి వంద పడకల ఆస్పత్రిలో హోటల్ నిర్వహణకు అవకాశం కల్పించాలని కోరేందుకు వచ్చాడు. మెట్లు ఎక్కలేక ఇబ్బంది పడడంతో ఓ జర్నలిస్టు, మరో ఫిర్యాదుదారు సహాయంతో కలెక్టర్ వద్దకు వెళ్లి అర్జీ సమర్పించాడు.



రాపాక పెంటయ్య, రాజమ్మ



దివ్యాంగుడు సంతోష్

వేతనాలు పెంచాలి



దళితఅభివృద్ధి(ఎస్సీడీడీ) శాఖ పరిధిలో మెట్రిక్ హాస్టళ్లలో కుక్‌లు, అసిస్టెంట్ కుక్‌లు జిల్లాలో 24 మంది పని చేస్తున్నాం. ఒక్కో హాస్టల్‌లో ముగ్గురు పని చేస్తుండగా రూ.20వేలు మాత్రమే కేటాయించారు. వందలాది మందికి వంట చేస్తున్న మాకు వేతనాలు సరిపోవడం లేదు. వంట సరిగా లేకపోయినా వార్డెన్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కనీస వేత నం రూ.15వేలకు పెంచాలి. సమస్యలు పరిష్కరించాలి.

ధాన్యం డబ్బులు ఇప్పించండి

భీమిని మండలం వెంకటపూర్ గ్రామంలో 25 మంది రైతుల నుంచి 750 క్వింటాళ్ల వరకు రూ.20 లక్షల విలువైన ధాన్యాన్ని జనవరి 6న వ్యాపారి సుంకరి మహేష్ కొనుగోలు చేశాడు. ఇప్పటికీ డబ్బులు చెల్లించలేదు. ప్రభుత్వ ధర కంటే రూ.500 ఎక్కువ చెల్లిస్తానని మోసం చేశాడు. డబ్బులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలి.



మసకబారిన కళ్లు!

- జిల్లాలో బయట పడుతున్న కంటి సమస్యలు
- ఇప్పటికే 72,277 మందిలో సమస్యల గుర్తింపు
- రీడింగ్ గ్లాస్‌తోపాటు, ప్రిస్క్రిప్షన్ గ్లాస్‌లు పంపిణీ



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: ప్రజల్లో కంటి సమస్యలను గుర్తించి నివారించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. శిబిరాలతో జిల్లా వాసుల్లో కంటి సమస్యలు బయటపడుతున్నాయి. జనవరి 19న జిల్లాలో కంటి వెలుగు శిబిరాలు 40 చోట్ల ప్రారంభించారు. శని, ఆది వారాలతోపాటు, ప్రభుత్వ సెలవు దినాల్లో ఈ శిబిరాలను నిర్వహించడంలేదు. జిల్లావ్యాప్తంగా రోజుకు 40 చొప్పున ఇప్పటి వరకు 31 రోజుల పాటు కంటి వెలుగు శిబిరాలను నిర్వహించారు. మరో 69 రోజులు శిబిరాలను జిల్లాలో నిర్వహిస్తారు. 18 ఏళ్ల పైబడిన వారికి పరీక్షలు నిర్వహిస్తున్న ఈ శిబిరాల్లో 40 ఏళ్ల పైబడిన వారిలో ఎక్కువగా కంటి సమస్యలు ఉన్నట్లు వైద్యులు గుర్తిస్తున్నారు. దగ్గరి చూపు సమస్య ఉన్న వారికి రీడింగ్ గ్లాసెస్ ఇస్తుండగా, ఇతర కంటి సమస్యలు ఉన్న వారికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ అందజేస్తున్నారు. ఆపరేషన్ అవసరం ఉన్నవారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారు.

40 ఏళ్ల పైబడిన వారిలో ఎక్కువ..

జిల్లాలో 18 ఏళ్ల పైబడిన వారు 5,36,109 మంది ఉండగా ఇప్పటి వరకు 1,83,270 మందికి 31 రోజుల్లో కంటి పరీక్షలు చేశారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 133, పట్టణ ప్రాంతాల్లోని వార్డుల్లో 66 శిబిరాలను నిర్వహించారు. కంటి సమస్యల్లో దగ్గరి చూపు సమస్య 41,062 మందికి ఉన్నట్లు గుర్తించారు. వీరికి రీడింగ్ గ్లాసెస్ అందించారు. దగ్గరి చూసు సమస్యలు ఉన్నవారిలో 40 ఏళ్లలోపు వారిలో 5,714 మందికి, 40 ఏళ్ల పైబడిన వారిలో 33,063 మందికి అందించారు. ఇతర కంటి సమస్యలు ఉన్న వారు 31,215 మందిని గుర్తించగా, వారికి అందించాల్సిన గ్లాసెస్‌ను ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేశారు. ఇందులో ఇప్పటి వరకు ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ 8,744 మందికి రాగా, అందులో ఇచ్చింది 8,529 మందికి పంపిణీ చేశారు. మిగిలిన వారు ఎదురు చూస్తున్నారు.

అవసరమైనవారికి అద్దాలు..

జిల్లాలో కంటి వెలుగు వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేసిన వారిలో దగ్గరి చూపు సమస్య ఉన్న వారికి రీడింగ్ గ్లాసెస్ వెంటనే అందిస్తున్నాం. ఇతర సమస్యలు ఉండి కళ్లద్దాలు ఇవ్వాల్సిన వారిని గుర్తించి, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ఇప్పటి వరకు 31,215 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ ఇవ్వాలని గుర్తించాం. 8,744 మందికి అద్దాలు రాగా, 8,529 మందికి పంపిణీ చేశాం.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి

అభివృద్ధిలో చెన్నూర్ మెరువాలి



ఇందారం ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న విప్ బాల్క సుమన్, అధికారులు, నాయకులు

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- అభివృద్ధి పనుల పరిశీలన

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గ కేంద్రం అభివృద్ధి పనులతో మెరువాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. ఈ నెల 15న పట్టణంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు రానున్న నేపథ్యంలో సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ సుందరీకరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సభ స్థలాన్ని సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ గంగాధర్, తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పనుల జాప్యంపై ఆగ్రహం

జైపూర్: రాజీవ్ రహదారిలో ఇందారం ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల జాప్యంపై విప్ సుమన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ నెల 15వరకు పూర్తి చేయాలని హెచ్‌కేఆర్ఆర్ సంస్థ అధికారులను ఆదేశించారు. జైపూర్, ఇందారం, రామారావుపేట గ్రామాల్లో అభివృద్ధి పనులు పరిశీలించారు. గోదావరి బ్రిడ్జి నుంచి ఇందారం క్రాస్ రోడ్డు వరకు, ఇందారం క్రాస్ నుంచి జైపూర్, పెద్దవాగు బ్రిడ్జి నుంచి జైపూర్ సెంట్రల్ లైటింగ్ పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మేడి సునిత, ఎంపీపీ గోదారి రమాదేవి, వైస్ ఎంపీపీ పెద్దపల్లి రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ గుండు తిరుపతి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బల్మూరి అరవీందర్‌రావు పాల్గొన్నారు.



లింగంపల్లి అర్బన్‌పార్కును పరిశీలిస్తున్న విప్

పార్కు పరిశీలన

చెన్నూర్‌రూరల్/భీమారం: చెన్నూర్ మండలం లింగంపల్లి గ్రామ సమీపంలో అర్బన్‌పార్కును విప్ సుమన్ సోమవారం పరిశీలించారు. భీమారం మండల కేంద్రంలో జాతీయరహదారిపై వంతెన పనులను సందర్శించారు. మూడు కిలోమీటర్ల సెంట్రల్ లైటింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శ్రీరాంపూర్ సీఐ రాజు, ఎన్‌హెచ్ డీఈఈ అన్నయ్య పాల్గొన్నారు.

ఎస్టీపీపీ అధికారుల కృషి ఫలితంగానే అవార్డులు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ) అధికారుల సమిష్టి కృషి ఫలితంగా అన్నిరంగాల్లో ముందంజలో నిలుస్తూ పలు అవార్డులు అందుకుంటోందని, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలని సింగరేణి డైరెక్టర్ డి.సత్యనారాయణరావు తెలిపారు. జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటును సోమవారం ఆయన సందర్శించారు. అనంతరం అధికారులతో సమావేశం అయ్యారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. డైరెక్టర్ సత్యనారాయణరావును అధికారులు శాలువాతో సన్మానించారు. విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణతోపాటు రక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్, జీఎం డీపీఎస్ఎస్ సూర్యనారాయణరాజు, జీఎం పీసీఎస్ రాజశేఖర్ రెడ్డి, ఏజీఎం సత్యనారాయణప్రసాద్, సుధాకర్, పవర్‌మేక్ ప్లాంటు మేనేజర్ అఖిల్‌కపూర్, ఎస్‌వోటు సీటీసీ ప్రభాకర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.



డైరెక్టర్ సత్యనారాయణరావుకు సన్మానం

ఓసీసీ మైన్స్‌కు బహుమతులు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంటు కంపెనీ(ఓసీసీ) మైన్స్‌కు పలు విభాగాల్లో బహుమతులు వచ్చినట్లు మైనింగ్ అధికారులు తెలిపారు. ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్, రాష్ట్ర స్థాయి మైన్స్ ఎన్వీరాన్‌మెంట్ అండ్ మినరల్ కన్సర్వేషన్ కౌన్సిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాల కార్యక్రమంలో పలు విభాగాల్లో అవార్డులను సొంతం చేసుకుందని తెలిపారు. ఓవరాల్ పర్ఫార్మెన్స్, మినరల్ కన్సర్వేషన్, వేస్ట్ మేనేజ్‌మెంటు, మినరల్ బెనిఫిషియస్‌లో మొదటి బహుమతి, రిక్లరేషన్, రిహాబిలిటేషన్‌లో రెండో బహుమతి, సస్టేనాబుల్ మేనేజ్‌మెంటులో మూడో బహుమతి సీసీవోఏం(ఐబీఏం) పీఎస్ శర్మ, ఆర్‌సీవోఏం(ఐబీఏం) శైలేంద్రకుమార్‌కుమార్ చేతుల మీదుగా అధికారులు అందుకున్నారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు వరిగడ్డి దగ్ధం

చింతలమానెపల్లి(సిర్పూర్): మండల కేంద్రంలో సోమవారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో వరిగడ్డి దగ్ధమైంది. బాధిత రైతు బుధాజి తెలిపిన వివరాల ప్రకారం తన పంటపొలం నుంచి వరిగడ్డిని ట్రాక్టర్‌లో తీసుకువస్తుండగా విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన ట్రాక్టర్ డ్రైవర్ ఇంజన్‌ను వేరుచేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గమనించిన స్థానికులు నీళ్లు చల్లి మంటలు ఆర్పినప్పటికీ అప్పటికే గడ్డి మొత్తం కాలిపోయింది. ప్రమాదంలో సుమారు రూ.10వేల ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

కలప అక్రమ రవాణాచేస్తే కఠిన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీవోలు

కాసిపేట(బెల్లంపల్లి): కలప అక్రమంగా రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకోనున్నట్లు జన్నారం, మంచిర్యాల, ఆసిఫాబాద్ ఎఫ్‌డీవోలు మాధవరావు, విజయ్‌కుమార్, వినయ్‌కుమార్ సాహు హెచ్చరించారు. సోమవారం కాసిపేట మండలం దేవాపూర్ రేంజ్ పరిధిలోని ఓరియంట్ సమావేశ మందిరంలో మంచిర్యాల, జన్నారం, ఆసిఫాబాద్ డివిజన్‌ల ఎఫ్‌డీవోలు అడవుల సంరక్షణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24 గంటలు నిఘాతో పాటు నాకా బందీ, బీట్ పరిధిలో పెట్రోలింగ్ చేయాలని, పక్కన ఉన్న రేంజ్ సిబ్బందితో సమన్వయం ఏర్పర్చుకుని కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. ఆయా ప్రదేశాల్లో చెకింగ్ పాయింట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో రేంజ్ అధికారులు అప్పలకొండ, రమేశ్, అనిత, స్వామి, సుభాశ్, రత్నాకర్‌రావు, సంతోశ్, డెప్యూటీ రేంజ్ అధికారులు, సెక్షన్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పోలీసులకు సవాల్‌గా మారిన ఆంధ్రా దొంగ

- కమిషనరేట్ పరిధిలో రెండేళ్లుగా వరుస చోరీలకు పాల్పడుతున్న వైనం
- అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం

నస్పూర్(మంచిర్యాల): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగ ఎట్టకేలకు పోలీసులకు చిక్కినట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారుజామున నస్పూర్ షిర్కే కాలనీలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడుతున్న దొంగను గుర్తించిన స్థానికులు అతన్ని చితకబాది పోలీసులకు అప్పగించారు. స్టేషన్‌కు తీసుకువెళ్లిన పోలీసులు అతని వేలిముద్రలు తీసుకుని ఇంటికి పంపించారు. వేలిముద్రలు పరిశీలించిన అధికారులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన పలు చోరీ ఘటనల్లో ఇతని వేలిముద్రలు సరిపోలినట్లు గుర్తించారు. వెంటనే తేరుకున్న స్థానిక పోలీసులు నస్పూర్ షిర్కే కాలనీలో నివాసం ఉంటున్న నిందితుడితో పాటు మరో అనుమానితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. సదరు నిందితుడు ఏపీలోని నెల్లూరు నివాసి. నస్పూర్‌కాలనీకి చెందిన ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకుని ఆటో నడుపుకుంటూ ఇక్కడే ఉంటున్నాడు. కమిషనరేట్ పరిధిలోని రామకృష్ణాపూర్, మందమర్రి, లక్సెట్టిపేట, గోదావరిఖని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు చోరీల్లో ఇతని ప్రమేయం ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై రవికుమార్‌ను సంప్రదించగా ఓ అనుమానితుడి అదుపులోకి తీసుకున్నామని, విచారణ అనంతరం త్వరలో వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.


పప్పు, రొట్టెలతో నైవేద్యం సమర్పిస్తున్న ఆదివాసీలు

గిరి పల్లెల్లో రంగోత్సవం!

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, పండుగలు అన్నివర్గాలకు భిన్నంగా ఉంటాయి. తమదైన శైలిలో పండుగలు జరుపుకోవడంలో తమకు తామే సాటి. అన్ని పండుగల కంటే భిన్నంగా హోలీ వేడుకలు జరుపుకుంటారు. వేడుకలు తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తారు. నేడు గిరిజన ఆదివాసీ గ్రామాల్లో హోలీ(దురాడి) వేడుకలపై 'సాక్షి' కథనం.

- సంప్రదాయబద్ధంగా కాముడి దహనం
- నేడు దురాడి (హోలీ) సంబురం
- డోలు, భాజాలతో తరలివెళ్లిన ఆదివాసీలు
- ఏళ్ల కాలం నుంచి వస్తున్న ఆచారం


ముస్తాబైన పులారాలు

హోలీ వేడుకల్లో భాగంగా సోమవారం కామునిదహనం నిర్వహించారు. వెదురు కర్రలతో రెండు పులారాలను తయారు చేసి వాటికి ఐదుబొట్ల కుడుకలు, అప్పాలు, గోగుపూలు, చక్కెరపేర్లు, వంకాయ అమర్చారు. అనంతరం డోలు, సన్నాయి మేళాలతో గ్రామ పొలిమేర వరకు తరలివెళ్లి కామునిదహనం చేశారు. అంతకు ముందు రెండు వెదుర్లకు వృద్ధుడు, వృద్ధురాలు అని పేరు పెట్టి వాటికి పులారాలను కట్టారు. కిందిభాగంలో నిప్పంటించారు. గ్రామ పటేల్ పూజలు చేసిన అనంతరం వారి ఆచారం ప్రకారం మంటపై వరుసగా దూకారు. అనంతరం గ్రామంలోని ప్రతీ కుటుంబం నుంచి తీసుకువచ్చిన పప్పు, రొట్టెలు నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. కాముని దహనం చేసిన చోటే రాత్రి బస చేశారు.

కుడుకలు ఇవ్వడం ఆచారం

ఆదివాసీల ఆచారంలో భాగంగా గ్రామ పటేల్, దేవారీలకు గ్రామస్తులంతా కుడుకులు ఇస్తారు. కుడుకలతో పాటు చక్కెర పేర్లు కూడా ఇస్తారు. ఇలా కుడుకలు ఇచ్చిన వారినే గ్రామస్తులుగా పరిగణిస్తారు. అనంతరం వాటిని లెక్కిస్తారు. ఈ కార్యమంతా కాముని దహనం రోజు జరుగుతుంది. అనంతరం వాటిని లెక్కిస్తారు. ఊర్లో ఎన్ని కుటుంబాలు ఉన్నాయో వాటికి సమానంగా కుడుకలు, పేర్లు వచ్చాయా? అని పరిశీలిస్తారు.

సతీయుగం నుంచి వస్తున్న ఆచారం

సతీయుగంలో రావణాసురుడు సీతను అపహరిస్తాడు. సీతకోసం రాముడు రావణాసురుడితో యుద్ధం చేస్తాడు. కానీ ఎన్ని బాణాలు వేసినా రావణాసురుడు మృతి చెందలేదు. రావణాసురుడి నాభిలో బాణం గుచ్చిస్తే తప్ప మృతి చెందడని విభీషణుడు అసలు రహస్యం చెప్పాడు. దీంతో రాముడు రావణాసురుడి నాభిలో బాణం వేయడంతో మరణిస్తాడు. చెడుపై మంచికి జరిగిన విజయానికి గుర్తుగా భావించిన అయోధ్యవాసులు ప్రతీ సంవత్సరం ఈ హోలీ పండుగను జరుపుకుంటారని పురాణాలు చెబుతున్నాయి.

సహజసిద్ధమైన రంగులు ఆరోగ్యకరం

నిర్మల్‌చైన్‌గేట్: హోలీ వేడుకల్లో సహజ సిద్ధమైన రంగులు వాడితేనే ఆరోగ్యకరం. కెమికల్స్ కలిసిన రంగుల వాడకంతో చర్మం ఎర్రబడడం, దద్దుర్లు రావడం, తిమ్మిర్లతో పాటు కళ్లలో పడితే చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే హోలీ వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. గతంలో మోదుగ, బంతి, కుసుమ పూల నుంచి పసుపు రంగు, గోరింటాకు నుంచి ఆకుపచ్చ రంగు, ఎర్రచందనం, జాప్రా మొక్కల నుంచి ఎరుపు రంగు, వాయిలాకుల నుంచి నలుపు రంగును తయారు చేసేవారు. వీటి ఆకులు, పూల రెక్కలు, విత్తనాలను వేడి నీటిలో బాగా ఉడకబెట్టి తయారుచేసిన రంగులు ఆరోగ్యానికి శ్రేయస్కరం. నిమ్మ, పసుపు, కుంకుమను వాడడంతో తయారయ్యే ఈ రంగులు వసంత రుతువు ప్రారంభంతో వాతావరణంలో కలిగే మార్పులను శరీరానికి తట్టుకోగలిగే శక్తిని అందిస్తాయని ఆయుర్వేద వైద్యులు సూచిస్తున్నారు.

రసాయన రంగులతో జాగ్రత్త



హోలీకి వినియోగించే రసాయన రంగులతో చర్మవాధులు వచ్చే ప్రమాదం ఉంది. గ్రీస్, ఆయిల్ వంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదు. ఇలాంటి రంగులతో చర్మంపై దురద, దద్దుర్లు, ఇతర చర్మవ్యాధులు వస్తాయి.
– డాక్టర్ అమరేశ్వర్, చర్మవ్యాధుల నిపుణులు

ప్రకృతి సిద్ధమైన రంగులే మేలు



ప్రకృతి సిద్ధంగా లభించే రంగులు వాడడంతోనే ఆరోగ్యానికి, పర్యావరణానికి మేలు జరుగుతుంది. కళ్లలో రంగుపడితే నలవడం, రుద్దడం చేయకుడదు. చల్లని నీటితో కళ్లను శుభ్రం చేసి అవసరమైతే నేత్ర వైద్యుడిని సంప్రదించాలి.
– డాక్టర్ సురేశ్, నేత్ర వైద్య నిపుణులు


మంటల పై నుంచి దూకుతున్న ఆదివాసీలు

అన్ని పండుగలకు భిన్నంగా..



అన్ని పండుగలకంటే భిన్నంగా హోలీని జరుపుకుంటాం. అంతా ఒక్కటై కాముని పున్నమిని జరుపుకుంటాం. ఇందులో కుడుకల ఆచారం చాలా ముఖ్యమైనది. కాముని దహనం తర్వాత అందరం రాత్రంతా ఇక్కడే బస చేయడం ఆనవాయితీ.
– పెందోర్ భీంరావు, గ్రామ పటేల్, చిన్నసాకడ

తరాలుగా వస్తున్న ఆచారం



మాతాత ముత్తాతల నుంచి వస్తున్న ఆచారమిది. అన్ని గ్రామాల్లోని ఆదివాసీలు ఈ పండుగలకు అతీతులే. ప్రతిఒక్కరూ ఈ ఆచారాలు పాటించాల్సిందే. హోలీ వేడుకలను పురుషులు మాత్రమే జరుపుకుంటారు.
– పెందోర్ మోతీరాం, ఎంపీపీ, కెరమెరి

కుమారుడి వివాహానికి వినూత్న ఆహ్వానం


ఆహ్వానిస్తున్న సర్పంచ్ జయలక్ష్మి

చెన్నూర్‌రూరల్: ఎవరైనా తమ ఇంట్లో జరిగే వివాహానికి సకుటుంబ సమేతంగా రావాలని శుభలేక ఇచ్చి లేదా బొట్టుపెట్టి ఆహ్వానిస్తారు. కానీ తమ కుమారుడి వివాహానికి రావాలని కొమ్మెర సర్పంచ్ జయలక్ష్మి వినూత్నరీతిలో ఆహ్వానం పలుకుతున్నారు. తాళ్లపల్లి జయలక్ష్మి, బక్కయ్య దంపతుల కుమారుడు కిరణ్ వివాహం ఈ నెల 9న బీరెల్లిలో జరుగనుంది. సదరు సర్పంచ్ ఇంటింటికీ వెళ్లి చీర, టవల్, శుభలేక ఇచ్చి తమ కుమారుడి వివాహానికి రావాలని ఆహ్వానిస్తున్నారు. గ్రామంలో సుమారు 400 వరకు నివాసాలు ఉండగా ఇంటింటికీ వెళ్లి చీర, టవల్ శుభలేక ఇచ్చి వివాహానికి రావాలని కోరుతున్నారు.

కార్మిక సమస్యలపై అలుపెరగని పోరాటం


హెచ్‌ఎంఎస్‌లో చేరుతున్న కార్మికులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి హెచ్‌ఎంఎస్ అలుపెరగని పోరాటాలు చేస్తోందని ఆ యూనియన్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. సోమవారం ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీకి చెందిన పలువురు కార్మికులు హెచ్‌ఎంఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల సమస్యలను గాలికి వదిలేసి పైరవీలకే పెద్దపీట వేస్తున్నాయన్నారు. కార్మికులకు నిత్యం అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తున్న ఏకైక సంఘం హెచ్‌ఎంఎస్ ఒక్కటేనన్నారు. సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో హెచ్‌ఎంఎస్‌ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎండీ గౌస్, ఏరియా కార్యదర్శి ఎస్‌కే ఇనూస్, పంచాక్షరీ, కిష్టస్వామి, పిట్ కార్యదర్శులు శ్రీనివాస్, సంపత్, ఆరీఫ్ పాల్గొన్నారు.

మహిళలు హక్కులకోసం పోరాడాలి

బెల్లంపల్లి: అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని మహిళలపై జరిగే రాజ్యహింస, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా జరుపుకోవాలని ఆదివాసీ విప్లవ మహిళా సంఘం(ఏవీఎంఎస్), విప్లవ మహిళా సంఘం(వీఎంఎస్) సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మనోత్మాదాన్ని రెచ్చగొడుతోందని, అక్రమంగా అరెస్టులు చేయిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మనువాద సిద్ధాంతాలకు, పితృస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. మహిళలు సమాన హక్కులకోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావ్


గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కనక భీంరావ్

ఉట్నూర్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావ్ పేర్కొన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన గిరిజనుల నుంచి 34 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్య పరిష్కారం కోసం అందించే అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో పీటీజీ భాస్కర్, ఏవో రాంబాబు, ఈఈటీడబ్ల్యూ భీంరావ్, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

- అగ్నిప్రమాదంలో కిరాణ షాపు దగ్ధమవడంతో కుటుంబం రోడ్డున పడిందని, జీవనోపాధి కోసం దుకాణం పెట్టుకోవడానికి ఐటీడీఏ ద్వారా రుణం అందించాలని ఆదిలాబాద్ మండలం తిప్పాకు చెందిన అడ మోహపత్ అర్జీ పెట్టుకున్నాడు.
- తన పంట సాగుకు గిరి వికాసం పథకం ద్వారా విద్యుత్ మోటార్, బోర్ బావి మంజూరు చేయాలని రెబ్బెన మండలం సింగాల్‌గూడకు చెందిన నాగవత్ విన్నవించాడు.
- స్వయం ఉపాధి కోసం తమకు చేపలు పట్టడంలో ఐటీడీఏ ద్వారా శిక్షణ ఇప్పించాలని భీమారం మండలం రాంపూర్‌కు చెందిన గిరిజనులు వేడుకున్నారు.
- డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని భీంపూర్ మండల కేంద్రానికి చెందిన తుమ్రా తుల సీరాం అర్జీ పెట్టుకున్నాడు.
- తాను సాగు చేసుకుంటున్న పోడు భూమికి అటవీ హక్కుల పత్రం మంజూరు చేయాలని జైనూర్ మండలం పోచంలొద్దికి చెందిన కనక మాన్కు వేడుకున్నాడు.

అక్రమ పట్టాలపై అధికారుల విచారణ


విచారణ జరుపుతున్న అధికారులు

- 'సాక్షి' కథనాలతో కదిలిన యంత్రాంగం

జన్నారం(ఖానాపూర్): సీలింగ్ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న సంఘటనపై 'సాక్షి'లో వచ్చిన కథనాలతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ ఆదేశాలతో సోమవారం మంచిర్యాల డీఐవో గంగాధర్, తహసీల్దార్ వెంకటకిషన్ సిబ్బందితో కలిసివెళ్లి చెరువువద్ద విచారణ జరిపారు. చెరువుచుట్టూ బౌండరీలను గుర్తించారు. రికార్డుల ప్రకారం అక్రమ పట్టా అని తేలడంతో నోటీసులు అందజేశారు.

అసలేం జరిగింది?

మండలంలోని సింగరాయిపేట్ శివారులో వెంకట సంపత్‌రావు, ఆజాద్ సుభాష్ చక్రధర్‌రావు, విజయరావు, శ్రీనివాస్‌రావు పేరుతో 42.33 ఎకరాల జాయింట్ పట్టా ఉంది. సీలింగ్ యాక్టు 1975 ప్రకారం మిగులు భూమి కింద ఇందులో నుంచి 22.22 ఎకరాల భూమిని 11 మంది పేరున పట్టా చేశారు. దామోదర్‌రావు పేరుపై ఐదెకరాలు, వెంకటమ్మ పేరుపై 2.20 ఎకరాల భూమి ఉంది. ఇట్టి భూమిని 2020లో తపాలాపూర్ గ్రామానికి చెందిన సీపతి రమణ పేరుపై ఐదెకరాలు, నైనాల విజయ్‌కుమార్ పేరుపై 2.20 ఎకరాలు పట్టా మార్పిడి చేసుకున్నారు. అసైన్‌మెంట్ యాక్టు ప్రకారం సీలింగ్ భూమి వారసుల పేరుపై మాత్రమే పట్టా మార్పిడి చేయవచ్చు. కానీ అప్పటి తహసీల్దార్ రాజ్‌కుమార్ వారసులు కాకున్నా రమణ, విజయ్‌కుమార్ పేరుపై పట్టా మార్పిడి చేశారు. సదరు వ్యక్తులు రైతుబంధు, పంటరుణం కూడా తీసుకున్నారు.

నోటీసులు ఇస్తాం

సింగరాయిపేట్ సీలింగ్ భూమి అక్రమ పట్టా విషయంలో వారసులకు కాకుండా ఇతరులపై అక్రమంగా పట్టా చేసినట్లు తేలింది. ఆన్‌లైన్ రికార్డులు తీయించి కలెక్టర్, ఆర్డీవోలకు పంపించాం. పూర్తి విచారణ జరిపి సదరు వ్యక్తులకు నోటీసులు ఇస్తాం. – వెంకటకిషన్ తహసీల్దార్



ప్రజాకవి అంజయ్యను విస్మరించిన ప్రభుత్వం


మాట్లాడుతున్న రాజేందర్

బెల్లంపల్లి: తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమానికి తన పాటలతో ఊపు తీసుకువచ్చిన ప్రజాకవి గూడ అంజయ్య, అతని కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని గూడ రాజేందర్ విమర్శించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో ఆయన పాటలు ఎంతగానో దోహదపడ్డాయన్నారు. అంజయ్య కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ ఇంత వరకూ నెరవేర్చలేదన్నారు. దళితుడు కావడం వల్లే సీఎం వివక్ష చూపుతున్నారన్నారు. అంజయ్య అంత్యక్రియలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకుండా అవమానానికి గురిచేశారన్నారు. పోరాటాల గడ్డ బెల్లంపల్లిలో గూడ అంజయ్య యాదిలో సాంస్కృతిక సభ నిర్వహించడం అభినందనీయమన్నారు. చిన్నాన్న అడుగు జాడల్లో సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగిస్తున్నానన్నారు.

తల్లిదండ్రులు లేని బాలుడికి చేయూత


సరుకులు అందజేస్తున్న మాలి సంఘం నాయకులు

చింతలమానెపల్లి: మండల కేంద్రానికి చెందిన గిరిజన బాలుడు మేకల భీమన్నకు మాలి సంఘం నాయకులు ఆపన్నహస్తం అందించారు. భీమన్న స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతిచెందగా వృద్ధులైన అమ్మమ్మ, తాతయ్యల దగ్గర ఉంటున్నాడు. మాలిసంఘం అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు బాలుడికి సోమవారం 25కిలోల బియ్యం, నోట్‌బుక్స్, బట్టలు, రగ్గులు అందజేశారు. సంఘం చింతలమానెపల్లి, కౌటాల మండలాల అధ్యక్షులు నికాడి బాపురావు, ఆదె వసంత్ పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు


అవగాహన కల్పిస్తున్న అధికారులు

చింతలమానెపల్లి(సిర్పూర్): మండల కేంద్రంలోని దుబ్బగూడలో సోమవారం అధికారులు బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు తహసీల్దార్ మష్కూర్ అలీ, శిశు అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎస్సై విజయ్ కుమార్, ఎంపీడీఓ మహేందర్ దుబ్బగూడకు చేరుకున్నారు. పెళ్లి కుమార్తె వివరాలు తెలుసుకుని మైనరని తేలడంతో వివాహం నిలిపివేయాలని బాలిక తల్లిదండ్రులకు సూచించారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలని, మైనర్లకు వివాహం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత

బెజ్జూర్: బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి మహేష్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్య ను అభ్యసిస్తున్న ఓ విద్యార్థినికి ఈ నెల 9న వివాహం జరిపించేందుకు తల్లిదండ్రులు నిశ్చయించారు. విషయం తెలుసుకున్న ఆయన సోమవారం పాఠశాలకు వెళ్లి విద్యార్థినికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆయన వెంట కేజీబీవీ ప్రత్యేక అధికారి అరుణ, కౌన్సిలర్లు చంద్రశేఖర్, ఝాన్సీరాణి, సిబ్బంది ఉన్నారు. జెండర్ అండ్ ఈక్విటీ జిల్లా కోఆర్డినేటర్ స్వర్ణ, క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ సుభాష్ రాథోడ్ కేజీబీవీని సందర్శించారు.